# సారంగాపూర్ ఎస్ఐ గీతపై డీజీపీకి ఫిర్యాదు

## విధుల పట్ల నిర్లక్ష్యం.. అక్రమ కేసుల ఆరోపణలు

**లిసారంగాపూర్ / జగిత్యాల జిల్లా, ( ప్రజా మంటలు) ఆగస్ట్ 24:** సారంగాపూర్ మండల ఎస్ఐ గీత తీరుపై మంగళవారం డీజీపీకి రేచపల్లి సర్పంచ్ బాస మహేష్ ఫిర్యాదు చేశారు. ఎస్ఐ విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపణలు చేశారు. బాధితుల ఫిర్యాదులపై సకాలంలో స్పందించడం లేదని విమర్శలు చేశారు.ప్రజల సమస్యలను పట్టించుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు చేశారు. ఫిర్యాదుదారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.చట్టపరమైన విధానాలను పాటించకుండా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.తమకు అనుకూలంగా ఉన్నవారికి ఒక విధంగా, బాధితులకు మరో విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బాధితుల వాదనలు పూర్తిగా వినకుండానే నిర్ణయాలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితులతో ప్రజల్లో పోలీసు వ్యవస్థపై నమ్మకం దెబ్బతింటోందని అన్నారు. పోలీసు అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రజల ఫిర్యాదులను నమోదు చేసి చట్ట ప్రకారం విచారణ చేయాలని కోరారు. అక్రమ కేసుల ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఎస్ఐ వ్యవహారశైలిపై



ఉన్నతాధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని కోరారు.ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బాధితులకు రక్షణ కల్పించడంతో పాటు న్యాయం చేయాలని కోరారు.పోలీస్ శాఖ ప్రతిష్ఠకు భంగం కలిగించే విధానాలకు అడ్డుకట్ట వేయాలని అన్నారు. అధికార దుర్వినియోగానికి తావులేకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదులపై పూర్తి స్థాయి విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని కోరారు. తప్పులు రుజువైతే సంబంధిత అధికారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలతో మర్యాదగా, బాధ్యతగా వ్యవహరించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. పోలీస్ స్టేషన్‌లో పారదర్శకమైన విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. బాధితుల ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే స్పందించాలని అన్నారు. న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించే ప్రజలకు భరోసా కల్పించాలని కోరారు. ఎస్ఐ పై వచ్చిన ఆరోపణలను ఉన్నతాధికారుల పర్యవేక్షణలో విచారణ జరిపితే వాస్తవాలు బయటపడతాయని అన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధానాలకు స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు. పోలీస్ శాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని కోరారు.ఎస్ఐ గీత వ్యవహారశైలిపై తగిన చర్యలు తీసుకోవాలని డీజీపీని పిర్యాదులో పేర్కొని, తనకు గానీ..ప్రజలకు గానీ..న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తానని రేచపల్లి సర్పంచ్ బాస మహేష్ తెలిపారు.

## ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు

### కూల్చివేయాలని జీవన్‌రెడ్డి ఫిర్యాదు



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, ( ప్రజా మంటలు ) ఆగస్ట్ 25:** జగిత్యాల మున్సిపాలిటీ సర్వే నంబర్ 138లోని 20 గుంటల స్థలంలో యాజమాన్య హక్కులు లేకుండా తప్పుడు అనుమతులతో చేపట్టిన అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి కోరారు. మంగళవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి ప్రజావాణిలో నోడల్ అధికారికి ఆయన వినతిపత్రం సమర్పించారు. అధికారులు, కలెక్టర్‌కు లేఖలు రాసి 10 నెలలు గడిచినా చర్యలు తీసుకోలేదన్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని జీవన్ రెడ్డి కోరారు.

## వెల్గటూర్ మండల అధ్యక్షులు గా రామిల్ల రాజేందర్



**వెల్గటూర్ ఆగష్టు 25 ( ప్రజా మంటలు ) :** మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వీ౹రాా వెల్గటూర్ మండల అధ్యక్షులు గా వెంకటాపూర్ గ్రామానికి చెందిన రామిల్ల రాజేందర్ నియామకం కావడం జరిగింది.వెల్గటూర్ మండల ఇంచార్జి మోకినపల్లి సతీష్,అధికార ప్రతినిధి మోకినపల్లి సాగర్,ప్రధాన కార్యదర్శి మెరుగు కుమార్,వేల్పుల భాస్కర్, ఉపాధ్యక్షులు ఇజ్జపురి రాజశేఖర్,వేల్పుల రాజేష్ గార్ల ఆధ్వర్యంలో నియామకం పత్రం అందించడం జరిగింది.ఈ కార్యక్రమం లో జగిత్యాల జిల్లా ఇంచార్జి రేణికుంట్ల సాగర్, జిల్లా అధ్యక్షులు దూముల గంగారాం పాల్గొన్నారు.నియామకం పట్ల పలువురు నాయకులు అభినందనలు తెలియజేయటం జరిగింది.

## వేదిక్ సైన్స్‌పై సుఖేష్ శర్మ పరిశోధనలకు యోగి ఆదిత్యనాథ్ ప్రశంసలు

### వేద రహస్యాలను ఆధునిక సమాజానికి అందించేలా ఐదు విభాగాల్లో పుస్తకాల రచన



**హైదరాబాద్, ఆగష్టు 25:** భారతీయ వేద విజ్ఞానం, యజుర్వేదం, ఆగమశాస్త్రాలపై పరిశోధనలు చేస్తున్న బ్రహ్మశ్రీ ఈశ్వరగారి సుఖేష్ శర్మ రచించిన 'వేదిక్ సైన్స్' ఐదు విభాగాల పుస్తకాలను ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుఖేష్ శర్మతో సుమారు 20 నిమిషాల పాటు వేద విజ్ఞానం, యజ్ఞ యాగాది క్రతువులు, వేదాల్లోని శాస్త్రీయ అంశాలపై ముఖ్యమంత్రి చర్చించారు.వేదాల్లో నిక్షిప్తమైన ప్రాచీన జ్ఞానం, శాస్త్రీయ అంశాలను ఆధునిక సమాజానికి అర్థమయ్యే రీతిలో అందించాలనే ఉద్దేశంతో 'వేదిక్ సైన్స్'ను ఐదు విభాగాలుగా రచించినట్లు సుఖేష్ శర్మ తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు యజ్ఞ యాగాది క్రతువులకు తాను నేతృత్వం వహించినట్లు పేర్కొన్నారు.పుస్తకాలతో పాటు పరిశోధనకు సంబంధించిన నివేదికలను కూడా యోగి ఆదిత్యనాథ్ పరిశీలించినట్లు సుఖేష్ శర్మ వెల్లడించారు. పరిశోధన అంశాలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి, మరింత లోతైన పరిశోధనలకు బనారస్ విశ్వవిద్యాలయంలోని సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించినట్లు తెలిపారు.ఈ పరిశోధనలకు ఛత్రపతి శివాజీ పీఠ అధ్యక్షులు బైలూరు యోగేష్ ప్రభు, తెలంగాణ సాధు పరిషత్ అధ్యక్షులు శంకర్ స్వామీజీ అందించిన ప్రోత్సాహం, సహకారాన్ని సుఖేష్ శర్మ ప్రత్యేకంగా గుర్తు చేసుకున్నారు. వారి సహకారం లేకుండా ఈ స్థాయిలో పరిశోధనలు కొనసాగించడం సాధ్యమయ్యేది కాదని అన్నారు.వేద విజ్ఞానంపై మరిన్ని పరిశోధనలు కొనసాగిస్తూ, భారతీయ ప్రాచీన జ్ఞానాన్ని భవిష్యత్ తరాలకు అందించడమే తన లక్ష్యమని సుఖేష్ శర్మ తెలిపారు.

## ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు సీఆర్‌ఆర్‌టీ వరం




**జగిత్యాల, ఆగష్టు 25 (ప్రజా మంటలు):** ఐసీయూలో తీవ్ర అనారోగ్యంతో చికిత్స పొందుతూ మూత్రపిండాల పనితీరు దెబ్బతిన్న రోగులకు కంటిన్యూస్ రీనల్ రీప్లేస్‌మెంట్ ట్రీట్‌మెంట్ (సీఆర్‌ఆర్‌టీ) ఆధునిక ప్రాణరక్షక చికిత్సగా నిలుస్తోందని కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి వైద్యులు తెలిపారు. సాధారణ డయాలసిస్‌ను తట్టుకోలేని అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న రోగులకు సీఆర్‌ఆర్‌టీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.జగిత్యాల ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఆర్‌ఆర్‌టీ యంత్రం పనితీరు, వినియోగం, ప్రయోజనాలను వైద్యులు వివరించారు. రోగికి అవసరమైన బీపీ మందులను కొనసాగిస్తూ 24 గంటల పాటు నిరంతరాయంగా డయాలసిస్ నిర్వహించడం ఈ విధానం ప్రత్యేకత అని తెలిపారు. దీంతో శరీరంలోని వ్యర్థ పదార్థాలు, విషతుల్యాలు, అదనపు ద్రవాలు క్రమంగా తొలగి రోగిపై ఒత్తిడి తగ్గుతుందని వివరించారు.గుండె, ఊపిరితిత్తులు, కాలేయం వంటి కీలక అవయవాలపై అదనపు భారం పడకుండా సీఆర్‌ఆర్‌టీ సహాయపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, నెఫ్రాలజిస్టు డాక్టర్ రాంచందర్, క్రిటికల్ కేర్ నిపుణుడు డాక్టర్ ఉపేందర్ రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, చంద్రశేఖర్, మహేష్, అబ్దుల్ వకీల్ తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ మెడికల్ కాలేజీకి సారంపల్లి మల్లారెడ్డి పార్థివదేహం అప్పగింత

### కన్నీటి వీడ్కోలు పలికిన నేతలు



**సికింద్రాబాద్,ఆగస్ట్ 25 ( ప్రజామంటలు):** సీపీఎం సీనియర్ నేత, ప్రముఖ రైతు ఉద్యమ నాయకుడు దివంగత సారంపల్లి మల్లారెడ్డి భౌతికకాయాన్ని వైద్య విద్యార్థుల పరిశోధనల నిమిత్తం ఆయన కుటుంబ సభ్యులు మంగళవారం గాంధీ మెడికల్ కాలేజీకి అప్పగించారు. అనారోగ్యంతో కన్నుమూసిన ఆయన ఆశయాలకు అనుగుణంగా కుటుంబ సభ్యులు ఈ దేహదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, కేంద్ర కమిటీ సభ్యులు జ్యోతి, ఎస్. వీరయ్య తదితరులు పాల్గొని నివాళులర్పించారు. గాంధీ మెడికల్ కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్స్ ప్రొఫెసర్ డాక్టర్ నాగమోహన్ రావు, చంద్రశేఖర్, ఫిజియాలజీ ప్రొఫెసర్ రమాదేవి, ప్రొఫెసర్ గౌరి, డాక్టర్ సంగీత, ఎంపీహెచ్‌వో వేణుగోపాల్ గౌడ్‌తో పాటు పెద్ద సంఖ్యలో వైద్య విద్యార్థులు, పార్టీ శ్రేణులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు 'జోహార్ మల్లారెడ్డి అన్న' అంటూ నినాదాలు చేస్తూ ఆయనకు ఘనంగా తుది వీడ్కోలు పలికారు. మల్లారెడ్డి సతీమణి భాగ్యలక్ష్మి,కూతురు సునీత,కుమారులు వాసుదేవరెడ్డి, మధుసూదన్ రెడ్డి,మనవళ్ళు,మనవరాళ్ళు ,బంధువులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.కాగా,సారంపల్లి మల్లారెడ్డి పార్థివ దేహం నుంచి కళ్ళను ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి,చర్మం ఉస్మానియా ఆసుపత్రి స్కిన్ బ్యాంక్కు, బాడీని గాంధీ మెడికల్ కాలేజీకి అప్పగించినట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ తెలిపారు. ఈసందర్భంగా మల్లారెడ్డి కుటుంబసభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## జగిత్యాల జ్యోతి హైస్కూల్‌లో ముందస్తు ఒనమ్ వేడుకలు



**జగిత్యాల, ఆగష్టు 25 (ప్రజా మంటలు):** జగిత్యాల జిల్లా కేంద్రంలోని జ్యోతి హైస్కూల్--ఐఐటీ నీట్ అకాడమీలో ముందస్తు ఒనమ్ వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహిం చారు.ఆగష్టు 26న జరగనున్న పవిత్ర తిరువోణం పర్వదినాన్ని పురస్కరించుకుని కేరళకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు సంప్రదాయ ఒనమ్ వస్త్రధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. రంగురంగుల పుష్పాలతో అతపూకళంను అందంగా అలంకరించి తమ సృజనాత్మకతను ప్రదర్శించారు.మహాబలి చక్రవర్తి స్మరణకు ప్రతీకగా, ఆనందం, ఐక్యత, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా కేరళలో ఒనమ్ పండుగను ఘనంగా నిర్వహిస్తారని ఈ సందర్భంగా నిర్వాహకులు తెలిపారు.పాఠశాల డైరెక్టర్ బియ్యాల హరిచరణ్ రావు విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఓణం శుభాకాంక్షలు తెలిపారు. డైరెక్టర్లు శ్రీధర్ రావు, మౌనిక రావు, బి. అజిత రావుతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## అక్రమాలకు అడ్డుకట్టకే డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులు

### అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం: మంత్రి అడ్లూరి






**గొల్లపల్లి, ఆగష్టు 25 (ప్రజా మంటలు):** ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత పెంచి, అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించేందుకే డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నామని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు.మంగళవారం గొల్లపల్లి మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌తో కలిసి మంత్రి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. గతంలో ఉన్న నకిలీ, డూప్లికేట్ కార్డులను తొలగించి, అర్హులకే ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా స్మార్ట్ కార్డుల విధానాన్ని తీసుకొచ్చామని చెప్పారు.ధర్మపురి నియోజకవర్గంలో 80,873, గొల్లపల్లి మండలంలోని 34 రేషన్ షాపుల పరిధిలో 15,185 కుటుంబాలకు కార్డులు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి కార్డుపై క్యూఆర్ కోడ్ ఉంటుందని, దాని ద్వారా కుటుంబ సభ్యుల వివరాలను తెలుసుకోవచ్చన్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ పొందేలా పోర్టబిలిటీ సౌకర్యం కల్పించామని, సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు.అర్హులైన వారికి రేషన్ కార్డులు రద్దు కావని, కొత్త కార్డుల జారీ, కుటుంబ సభ్యుల పేర్ల చేర్పు ప్రక్రియ కొనసాగుతుందని మంత్రి స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద తొలి విడతలో రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించామని, త్వరలో రెండో విడత ప్రారంభిస్తామని చెప్పారు. అర్హులైన వారికి కొత్త పింఛన్లు మంజూరు చేసే ప్రక్రియ కూడా కొనసాగుతోందన్నారు.కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ స్మార్ట్ రేషన్ కార్డులు భవిష్యత్తులో వివిధ ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలకు కీలక పత్రంగా మారనున్నాయని తెలిపారు. రేషన్ కేటాయింపులు, పొందిన సరుకుల వివరాలను తెలుసుకునేందుకు తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో మొబైల్ యాప్ అందుబాటులో ఉందన్నారు. రేషన్ షాపులపై ఫిర్యాదులను కూడా యాప్ ద్వారా చేయవచ్చని చెప్పారు.మండలంలోని నాలుగు గ్రామాల్లో డిజిటల్ భూ ఆధార సర్వే నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ మధుసూదన్, డీఎస్ఓ జితేందర్ రెడ్డి, తహసీల్దార్ మాజీద్, ఎంపీడీఓ రవీందర్ రావు, ప్రజాప్రతినిధులు, అధికారులు, రేషన్ డీలర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఎస్ కే ఎన్ ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల స్వాగతోత్సవాల సంబరాలు




**గొల్లపల్లి అగస్ట్ 25 ప్రజా మంటలు :** జగిత్యాల జిల్లా కేంద్రంలోని, స్థానిక ఎస్ కే ఎన్ ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, మంగళవారం గొల్లపల్లి రోడ్డు లోని ఐ.వా. గార్డెన్స్ లో స్వాగత సంబరాలు ఫ్రెషర్స్ డే నిర్వహించుకున్నారు. కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, కళాశాలలో ఈ సంవత్సరం ప్రవేశం పొందిన మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలుకుతూ, వారికి కళాశాల లో కొత్తదనం లేకుండా బెరుకుదనం రాకుండా ఉండేందుకు ఈ ఫ్రెషర్స్ డే ఉత్సవాలు నిర్వహించు కుంటున్నామని విద్యార్థులు తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపల్ డి, నాగభూషణం అధ్యక్షతన, అధ్యాపకుల సహకారంతో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా స్థానిక 22 వ వార్డు కౌన్సిలర్ అరవ లక్ష్మి,రాజు పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధ భక్తులతో విద్యను అభ్యసించి, అధ్యాపకుల సూచన మేరకు బాగా చదువుకొని, భవిష్యత్తులో ఉన్నత స్థితిలో ఉండాలని, తల్లిదండ్రులకు అధ్యాపకులకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆశించారు మల్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎం, శివరామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ఈ వయసులో చెడు వ్యసనాలకు లోను కాకుండా, ఇతరత్రా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడకుండా ఉంటూ, మంచి విద్యను మంచి సంస్కారాలను అందిపుచ్చుకుని మంచి భవిష్యత్తులోకి అడుగు పెట్టాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ నాగభూషణం మాట్లాడుతూ విద్యార్థులు ఈ వయసులో మంచి నిర్ణయాలు తీసుకొని క్రమము తప్పకుండా కళాశాలకు వస్తూ, అధ్యాపకులు చెప్పిన విషయాన్ని చక్కగా నేర్చుకుంటూ ఏరోజుకారోజు ఒక ప్రణాళిక బద్ధంగా చదువును కొనసాగించాలని అలాగే ఈ విద్య సంవత్సరంలోనే భవిష్యత్తులో తాము ఏ స్థాయిలో ఉండాలనుకుంటున్నారో, ఒక మంచి లక్ష్యాన్ని నిర్ణయించుకొని, తదనుగుణంగా చదువుతూ, మంచి మార్కులతో పాసై, ఉన్నత శిఖరాలను చేరుకోవాలని, అలాగే సమాజంలో మంచి పౌరులుగా కీర్తి ప్రతిష్టలు గడించాలని ఆకాంక్షించారు. అటు పిమ్మట గత సంవత్సరం అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. తదనంతరం విద్యార్థుల నృత్యాలు అలరించాయి ఈ కార్యక్రమం లో అధ్యాపకులు శ్రీహరి, వాసు, రామకృష్ణ, శ్రీనివాస్, విజేందర్రావు, యాకూబు, కృష్ణమోహన్, రాజేందర్, నరేందర్, సలీం, నవనీత, సుష్మ, అశోక్, కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతు బీమాపై కలెక్టర్‌కు వినతిపత్రం

### ప్రజావాణిలో వినతిపత్రం అందజేసిన తెలంగాణ రైతు రక్షణ సమితి



**ఎల్కతుర్తి ఆగష్టు 25 ప్రజా మంటలు :** హనుమకొండ: రైతు బీమా పథకంపై రైతుల్లో నెలకొన్న ఆందోళనను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రైతు రక్షణ సమితి ఆధ్వర్యంలో ఈరోజు హనుమకొండ జిల్లా ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గారికి వినతిపత్రం అందజేశారు.తెలంగాణ రైతు రక్షణ సమితి హనుమకొండ జిల్లా అధ్యక్షులు హింగే భాస్కర్ ఆధ్వర్యంలో రైతు బీమా సమస్యను కలెక్టర్ గారి దృష్టికి తీసుకెళ్లారు. రైతు కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే రైతు బీమా పథకం విషయంలో స్పష్టత కల్పించి, పథకాన్ని నిరంతరాయంగా కొనసాగించాలని కోరారు.వరంగల్ జిల్లా అధ్యక్షులు వరికెల కిషన్ రావు మాట్లాడుతూ, రైతు కుటుంబంలో ప్రధాన ఆధారమైన వ్యక్తి అనుకోని ప్రమాదానికి గురైనప్పుడు ఆ కుటుంబానికి రైతు బీమా ఎంతో అండగా ఉంటుందని అన్నారు. రైతు బీమా విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించి, రైతుల్లో నెలకొన్న ఆందోళనను తొలగించాలని డిమాండ్ చేశారు. అర్హులైన రైతులందరికీ బీమా రక్షణ కల్పించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.రైతు కుటుంబాలకు భరోసా కల్పించే రైతు బీమా పథకాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిపివేయకుండా కొనసాగించాలని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ గారిని కోరారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు వరికెల కిషన్ రావు హనుమకొండ జిల్లా అధ్యక్షులు హింగే భాస్కర్, జిల్లా నాయకులు చౌల రామారావు, సుక్కినే సుధాకర్ రావు, అంబిరి శ్రీనివాస్, సురాబు బాపూరావు, వాంకే రాజు, మాధవరావు, బిక్షపతి, ఎర్రబెల్లి రవీందర్, గుండా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ విద్యపై అధ్యయనానికి తెలంగాణ రక్షణ సేన కమిటీ

**హైదరాబాద్, ఆగష్టు 25 (ప్రజా మంటలు):** తెలంగాణలో పాలిటెక్నిక్ విద్య కొనసాగింపు, దాని ఆవశ్యకతపై సమగ్ర అధ్యయనం చేసేందుకు తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత కమిటీని ఏర్పాటు చేశారు. జీవో 97 అమలు, పాలిటెక్నిక్ విద్యను స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడం వల్ల తలెత్తే పరిణామాలపై కమిటీ అధ్యయనం చేయనుంది.పాలిటెక్నిక్ విద్యను ప్రస్తుత విధానంలోనే కొనసాగించాలా? జీవో 97తో విద్యార్థులపై ఎలాంటి ప్రభావం పడుతుంది? స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి చేర్చడం వల్ల ఎదురయ్యే సమస్యలు ఏమిటి? అనే అంశాలపై కమిటీ అధ్యయనం చేయనుంది.జీవో 97ను రద్దు చేయాలని, పాలిటెక్నిక్ విద్యను శక్తి (కార్మిక శాఖ) పరిధిలోకి తీసుకురావద్దని విద్యార్థులు ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు కవిత తెలిపారు. కమిటీ సభ్యులు వారం రోజుల్లోగా సమగ్ర అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని ఆమె సూచించారు.

**కమిటీ సభ్యులు:**

1. దూగుంట్ల నరేశ్ ప్రజాపతి,
2. మోరం వీరభద్రారావు,
3. సురభి,
4. కొంగర ధరణి రాణి,
5. కోట్ల మహేందర్ రెడ్డి (కనిష్క),
6. ఊదరి చంద్రమోహన్ గౌడ్,
7. నడిపల్లి వెంకటేశ్వర్ రావు

## జీలుగుల గ్రామంలో విషాదం - కెక్కర్ల శ్రీనివాస్ మృతికి క్లాస్‌మేట్స్ సంతాపం



**ఎల్కతుర్తి ఆగస్టు 25 ప్రజా మంటలు :** హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని జీలుగుల గ్రామంలో మంగళవారం విషాదం చోటుచేసుకుంది. జీలుగుల గ్రామానికి చెందిన కెక్కర్ల శ్రీనివాస్ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.మంగళవారం నిర్వహించిన శ్రీనివాస్ అంత్యక్రియలకు ౹రాజ 1987--88 బ్యాచ్ క్లాస్‌మేట్స్‌తో హాజరై కన్నీటి నివాళులు అర్పించారు. తోటి విద్యార్థులు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే శ్రీనివాస్ అందరితో కలిసిమెలిసి ఉండేవారని, తరగతి గదిలో తన మాటలు, పాటలతో తోటి విద్యార్థులను నవ్విస్తూ ఉత్సాహంగా ఉండేవారని క్లాస్‌మేట్స్ గుర్తు చేసుకున్నారు. మంచి గాయకుడిగా, స్నేహశీలిగా, అందరినీ ఆప్యాయంగా పలకరించే వ్యక్తిగా తమ హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు.ఎప్పుడూ తమతో నవ్వుతూ, పాటలు పాడుతూ ఉండే మంచి మిత్రుడు ఈరోజు తమ మధ్య లేకపోవడం ఎంతో బాధాకరమని క్లాస్‌మేట్స్ ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.శ్రీనివాస్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు

## బద్దిపోచమ్మ ఆలయంలో భక్తిశ్రద్ధలతో బోనాల మొక్కులు



**వెల్గటూర్ ఆగష్టు 25 ( ప్రజా మంటలు ) :** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన బద్దిపోచమ్మ ఆలయంలో మంగళవారం భక్తుల సందడి నెలకొంది. గ్రామ దేవత, శీతల దేవత అయిన బద్దిపోచమ్మ అమ్మవారికి మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి భక్తిశ్రద్ధలతో బోనం మొక్కులు చెల్లించుకున్నారు.మంగళవారం పురస్కరించుకుని భక్తులు అమ్మవారికి బెల్లం బోనాలు శాకంబరి నైవేద్యాలు (పట్నాలు) ఒడిబియ్యం సమర్పించి పట్టుచీరలు సారెలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పరిసరాలు భక్తుల శివసత్తుల పూనకాలు జయజయధ్వానాలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి.

## నీట్--పీజీ పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు




**జగిత్యాల జిల్లా ప్రతినిధి, ఆగష్టు 25 (ప్రజా మంటలు):** ఆగష్టు 30న నిర్వహించనున్న నీట్--పీజీ 2026 పరీక్షను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, భద్రత వంటి అన్ని సదుపాయాలు సిద్ధంగా ఉంచాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 14 జిల్లాల్లో 56 కేంద్రాల్లో 17,627 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు.జగిత్యాల జిల్లాలో జేఎన్‌టీయూ కొండగట్టులో రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని కలెక్టర్ బి. సత్య ప్రసాద్ తెలిపారు. ఇక్కడ 100 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని, అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని చెప్పారు.అదేవిధంగా రాష్ట్రంలోని 27 ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను ప్రాధాన్యతా ప్రాతిపదికన అభివృద్ధి చేయాలని సీఎస్ సూచించారు.వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ రెవెన్యూ బి.ఎస్. లతతో పాటు సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## వృద్ధురాలి మృతి కేసు ఛేదనలో కీలక ఆధారాలు



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, ఆగష్టు 25 (ప్రజా మంటలు):** తిమ్మాపూర్ శివారులో వృద్ధురాలి మృతి కేసును జగిత్యాల రూరల్ పోలీసులు నాలుగు గంటల్లోనే ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేశారు. కేసు దర్యాప్తులో కీలకమైన బైక్ ఫోటో ఆధారాలను పోలీసులకు అందించిన గ్రామస్తులు దోమల రవి, దోమల గంగాధర్‌ను జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించి బహుమతులు అందజేశారు.నేరాల ఛేదనలో ప్రజల సహకారం ఎంతో కీలకమని ఎస్పీ తెలిపారు. అనుమానాస్పద ఘటనలు లేదా నేరాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. కేసును వేగంగా ఛేదించిన రూరల్ సీఐ సుధాకర్, ఎస్ఐ ఉమాసాగర్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్, డీఎస్పీ పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

